
Dr.G.Rajesh
CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 98 ఎడిటర్ : జి.రాజేష్ శనివారం 04 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00


# ఉక్కు రాష్ట్రంగా ఏపీ

రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు




- జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం
- 2028లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి
- కియా అభివృద్ధికి... బ్రాహ్మణీ స్టీల్స్ అవినీతికి నిదర్శనం
- అనంత నుంచి 90 దేశాలకు కియా కార్ల ఎగుమతి
- బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో ఐరన్ ఓర్ దోపిడీ, విదేశాలకు స్మగ్లింగ్
- సున్నపురాళ్లపల్లిలో

కియా అభివృద్ధికి... బ్రాహ్మణీ స్టీల్స్ అవినీతికి నిదర్శనం

అనంత నుంచి 90 దేశాలకు కియా కార్ల ఎగుమతి

బాహ్మణీ స్టీల్స్ పేరుతో ఐరన్ ఓర్ దోపిడీ,

స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

కడప, ఐఎన్‌బిటైమ్స్

పరిశ్రమలు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సహా, ఆర్సెల్లార్ మిట్టల్, వైజాగ్ స్టీల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రాష్ట్రంగా మారుతుందని ఆయన అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపు రాళ్ల పల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మలతో కలిసి సీఎం ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. రాయల సీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులూ సీఎం ప్రారంభించారు.

మిగతా 2లో



# ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న జూపల్లి

- సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చానని వెల్లడి
- అబద్దాల లేఖలతో ప్రచారం చేస్తున్న హరీష్ రావు
- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి

2లో



# లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం

- పదేళ్ల నిర్వహణకు 4,500 కోట్లతో టెండర్లు
- శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- పదేళ్ల నిర్వహణకు 4,500 కోట్లతో టెండర్లు.
- శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

జగ్గయ్యపేట, ఐఎన్‌బిటైమ్స్

రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట నియోజకవర్గంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. 15 కోట్లతో అక్కడి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు, పది సంవత్సరాలు పాటు నిర్వహణ పనుల కోసం

మిగతా 2లో



భావ ప్రకటన స్వేచ్ఛ అంటే

# బూతుల ప్రచారమా?

- సోషల్ మీడియాలో పవన్‌పై విమర్శలు తగవు
- ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోంది
- మండిపడ్డ మంత్రి కందుల దుర్గేశ్

2లో

# అమాంతంగా పెరిగిన బంగారం ధరలు

- తగ్గినట్లే తగ్గి భారీగా పెరుగుదల నమోదు
- 10 గ్రాముల పసిడి ధర గురువారం రూ.1,47,500
- మళ్లీ లక్షా 50 వేలు దాటిన తులం బంగారం ధర



# మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనంపై కార్యాచరణ ను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశం
- మాజీ పిసిసిఎఫ్ సువర్ణను చీరతో సత్కరించిన మంత్రి



# ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి



- పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది
- సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలది
- కుప్పంలో ఏబీఐఎస్ ప్రోటీన్స్, ఎంఎంస్ఎంఈ
- పార్కులను ప్రారంభించిన ముఖ్యమంత్రి

కుప్పం,ఐఎన్‌బిటైమ్స్ కుప్పంలో వివిధ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి నేరుగా కుప్పం వచ్చారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలం పొగురుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

మిగతా 2లో



# అవినీతి, స్కామ్‌లకు చంద్రబాబు బ్లూప్రింట్

- అమరావతి రాష్ట్రానికి గుబండగా మారనుంది
- నిజానికి అక్కడి నేలలు కట్టడాలకు పనికిరావు
- అమరావతికి పెట్టే నిధుల్లో 10 శాతంతో మావిరన్ అద్భుతం
- మీడియా సమావేశంలో వైసిపి కో ఆర్డినేటర్ సజ్జల వ్యాఖ్యలు

బిఆర్ఎస్ హయాం అప్పులపై

# తప్పుడు ప్రచారం

తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లే

మంత్రి జూపల్లి కిష్టారావుకు హరీష్ రావు లేఖ



హైదరాబాద్,ఐఎన్‌బిటైమ్స్

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో

మిగతా 2లో

# ఉక్కు రాష్ట్రంగా ఏపీ



ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుంది. ఉక్కు ఉత్పత్తి, సోలార్ ప్రాజెక్టు ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 3,850 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేలా నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. రూ.20,350 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. జమ్మలమడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్లను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

**దశాబ్దల నిరీక్షణ నిజమైంది..**

రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సీఎం మాట్లాడుతూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి దశాబ్ద కాలం పాటు ఎదురు చూశాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరింది. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్-రాయల్ ఎన్ ఫీల్డ్. కియాకార్లు, హీరో బైక్స్ , డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ. సీమ ఇకపై ఏమాత్రం కరువు నేల కాదు, జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతం. పరిశ్రమలు, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో ఓ నవ శకం మొదలైంది. విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలు దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓసారి, 2023లో మరోమారు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టాం. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఆదుకున్నాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలి. గండికోట నుంచి 15 కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేసి 2 టీఎంసీల నీటిని స్టీల్ ప్లాంట్ కు సరఫరా చేస్తాం. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అత్యంత నాణ్యమైన ముడి ఇనుము ఖనిజాన్ని కూడా ప్లాంట్ కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గత పాలనలో రాయలసీమ నష్టపోయింది..**

రాయలసీమ ఎవరి వల్ల నష్ట పోయిందో ప్రజలు గుర్తించాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా 2017లో అనంతపురం జిల్లాకు కియా కార్ల పరిశ్రమను తీసుకువచ్చాం. 536 ఎకరాలను కేటాయించి, నీళ్లు ఇచ్చి ఉత్పత్తికి అన్ని విధాలా సహకరించాం.

మేం తెచ్చిన కియా కంపెనీ 19 లక్షల కార్లు ఉత్పత్తి చేసింది. ఇందులో 3 లక్షల కార్లు 90 దేశాలకు పైగా ఎగుమతి అయ్యాయి.

# లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం



4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు రామానాయుడు చెప్పారు.వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18 వేల కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయాడన్నారు. పోలవరం డయాఫ్రమ్వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడు అయ్యాడన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసిపి 200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే 1200 కోట్లు ఖర్చు చేసినట్లు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా గొడ్డలి పార్టీ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలు మూత పడిందన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయన్నారు. రాష్ట్రంలో 1023 లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణ కోసం, 5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని ఆయన గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంస మైందనడానికి ఐడిసినే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఉదహరించారు.రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకో మాట అన్న చందంగా ఉంది ఆయన తీరు అన్నారు.

# బిఆర్ఎస్ హయాం అప్పులపై తప్పుడు ప్రచారం

తీసుకున్న రుణాలు,ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్‌ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని,

కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్‌రావు, ఇకనైనా అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

# ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న జూపల్లి



హైదరాబాద్,జూలై3 తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు.. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ రిటర్న్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. తాను చెప్పినవి అబద్ధాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి' అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# అమాంతంగా పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,జూలై3: బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. తగ్గినట్లే తగ్గిన పసిడి ధర అమాంతం పెరిగిపోయింది. అంతర్జాతీయ ధరలను అనుసరించి మళ్లీ రూ.1.50 లక్షల స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఒక్కరోజులోనే రూ.3300 మేర పెరిగింది. అటు వెండి సైతం కిలో రూ.5వేలు పెరిగి రూ.2.45 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని దిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర గురువారం రూ.1,47,500గా ఉండగా.. రూ.1,50,800కి చేరింది. వెండి రూ.2.40 లక్షల నుంచి రూ.2.45 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్సు ఒక్కరోజులో 57 డాలర్లు పెరిగి 4,181 డాలర్లకు చేరుకోగా.. వెండి ఔన్సు 2.44 శాతం పెరిగి 62.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం, వెండి ధరలు ఇటీవల దిద్దుబాటుకు గురయ్యాయి. గరిష్ఠాల నుంచి దాదాపు 10 శాతం మేర పతనమయ్యాయి. దీంతో వీటి ధరలు మరింత పడతాయన్న అంచనాలతో చాలా మంది తమ వద్ద ఉన్న బంగారాన్ని సైతం విక్రయించారు. అయితే, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు పసిడికి మళ్లీ డిమాండ్ కల్పించాయి.

# ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి

వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఏబీఐఎస్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చికెన్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్క్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ రెండు ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి, రైతులకు మార్కెట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించనున్నాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లె గ్రామంలో 30.75 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఏబీఐఎస్ ప్రోటీన్స్ గ్రీన్‌ఫీల్డ్ పౌల్ట్రీ, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. ఈ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు ప్లాంట్ పనితీరును పరిశీలించారు. ప్లాంట్లో ఏయే విభాగాలు ఏ విధంగా పని చేస్తాయన్న అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కంపెనీకి చెందిన యాజమాన్య ప్రతినిధులు వివరించారు. ఆ సంస్థ నిర్వహించిన జాబ్ ఫెయిర్ లో ఉద్యోగాలు పొందిన యువతకు సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందించారు. ఈ నెల నుంచే వాణిజ్య ఉత్పత్తిని ఆ సంస్థ ప్రారంభించనుంది. ఈ పరిశ్రమ ద్వారా మొత్తం 1,400 మందికి ఉపాధి లభించనుండగా, అందులో 700 ప్రత్యక్ష, 700 పరోక్ష ఉద్యోగాలు ఉన్నాయి. ప్రారంభ దశలోనే 300 నుంచి 400 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ యూనిట్ ద్వారా స్థానిక పౌల్ట్రీ రైతులకు గిట్టుబాటు ధరలకు మార్కెట్ లభించడంతో పాటు, ఒప్పంద పద్ధతిలో కోళ్ల పెంపకానికి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఫీడ్ సరఫరా, రవాణా, అనుబంధ రంగాలకు కూడా ఈ పరిశ్రమ ఊతం ఇవ్వనుంది. పొగురుపల్లెలో 44.58 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్క్ ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ పార్కులో 167 పారిశ్రామిక ప్లాట్లను జూలై నెల నుంచే పారిశ్రామికవేత్తలకు కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు ఒకేచోట కల్పించడం ద్వారా కొత్త పరిశ్రమలు వేగంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

దీనివల్ల స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కుప్పం పారిశ్రామిక హబ్‌గా మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఈ పార్క్ దోహదపడనుంది. ఇక 7,489 మంది ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరేలా రూ. 28 కోట్లతో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. అలాగే కనమాన పల్లి, గంగాపురం, టీ సముద్రం, కృష్ణానగర్, బళ్ల గ్రామాల్లో రూ. 25 కోట్లతో రెస్కోకు చెందిన 5 సబ్ స్టేషన్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ చరిత్రలో ఇవాళ మరిచిపోలేని రోజు. ఏబీఐఎస్ ప్రోటీన్స్ సంస్థ ఇప్పటికే 400 మందికి ఉపాధి కల్పించింది. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీతో దేశంలో అతి పెద్ద చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉంది. స్థానిక కోళ్ల పెంపకం దారులు ఈ సంస్థ ద్వారా లబ్ధి పొందుతారు.

# భావ ప్రకటన స్వేఛ అంటే బూతుల ప్రచారమా?

విజయవాడ,జూలై3:సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు.

ఈసంద ర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకా భివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించ నున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

# మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

హైదరాబాద్,జూలై3 రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు.అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశర చేశారు.

# అవినీతి, స్కామ్‌లకు చంద్రబాబు బ్లూప్రింట్

అమరావతి,జూలై3 అవినీతి, స్కామ్‌లకు చంద్రబాబు బ్లూప్రింట్ తయారుచేసుకున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. అమ రా వతి రాష్ట్రానికి గుదిబండ.. కానుందని, స్కామ్‌లు చేయడానికే అమరావతి పెట్టారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అమరావతిలో పెట్టే నిధుల్లో 10 శాతం మావిగన్‌లో పెట్టినా ఎంతో అభివృద్ధి చేయొచ్చన్నారు. మావిగన్‌పై వైఎస్ జగన్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ప్రపంచస్థాయి రాజధాని అన్న చంద్రబాబు ఇప్పుడు మున్సిపాలిటీ అంటున్నారు. రాజధానికి ప్రభుత్వ భూమి ఉంటే మంచిదని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి నేల రాజధానికి పనికిరాదని గతంలో చాలా మంది చెప్పారు. అమరావతి నేల కుంగిపోతుంది.. ఇది ప్రమాదకరం. అమరావతి పూర్తి చేయాలనే ఉద్దేశం చంద్రబాబుకు లేదు. వైఎస్ జగన్ అడిగిన ప్రశ్నలకు టీడీపీ నేతలు ఎక్కడైనా సమాధానం ఇస్తున్నారా? అంటూ సజ్జల ప్రశ్నించారు.'మావిగన్‌లో తక్షణ అభివృద్ధికి అవకాశం ఉంది. అమరావతి అప్పుల భారాన్ని రాష్ట్రం మోయలేదు. రైతులు ఇచ్చిన భూముల్లో లే అవుట్‌లు కూడా అభివృద్ధి చేయడం లేదు. లే అవుట్‌లు అభివృద్ధి చేయలేకపోతే రైతుల పరిస్థితి ఏంటీ?. అమరావతి కోసం అప్పు తెచ్చిన రూ.47 వేల కోట్లతో మెడికల్ కాలేజీలు, మచిలీపట్నం పోర్టు, హంద్రీనీవా కాలువ పూర్తి చేయొచ్చు. పాఠశాలలు దేవాలయాలు మాదిరిగా ఉండాలి. ఇప్పుడు ఎలా ఉన్నాయి?. చదరపు అడుగుకు రూ. 20 వేల ఖర్చు ఏంటీ? ఎక్కడైనా ఉందా?. ప్రశ్నిస్తే గొంతు నొక్కుతున్నారు.. భయపెడుతున్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

INB TIMES
తెలుగు దినపత్రిక Telugu Daily News Pape



# ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో సైతం నో అడ్మిషన్ బోర్డులు చూస్తుంటే గర్వంగా ఉంది

- జనసేన నాయకులు ఏ ఎన్ బాబు
- అల్లూరు ప్రభుత్వ పాఠశాలను విజిట్ చేసి విద్యార్థులకు
- పుస్తకాలు, పెన్నులు అందించిన ఏ ఎన్ బాబు





ముదినేపల్లి 03 - 07 - 2026 ఐ ఎన్ బి టైమ్స్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమర్థత వల్ల నేడు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 80000 మంది ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి ప్రభుత్వం పాఠశాలలకు చేరుకున్నారు అని యిది మహా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న అభివృద్ధికీ, మౌలిక వసతుల కల్పనకు నిదర్శనం అని
జనసేన సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపార వేత్త ఏ ఎన్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లూరు ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా విజిట్ చేసిన అయన విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉంటుంది అని, నూతన విద్యా సంవత్సరం అందరికి ప్రభుత్వం నుంచి పుస్తకాలు, యూనిఫామ్ కిట్లు అందాయ అని అరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం పాఠశాలలకు దీటుగా నడుపుతూ విద్యార్థులకు అన్ని పుస్తకాలు, యూనిఫామ్, ఐడి, షూ, మధ్యాహ్నం పోషకాలతో నిండిన భోజనం అందిస్తున్నారు అని, విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది అయితే 1వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్నారో అందరికి పథకం వర్తిస్తుంది అని, ప్రతి విద్యార్థికి తల్లి ఖాతాలో 15 నగదు కూటమి ప్రభుత్వం వేస్తుంది అని, ప్రతి విద్యార్థి తమ తల్లి, తండ్రులు పడుతున్న కష్టాలు, చేస్తున్న శ్రమను గుర్తుకు తెచ్చుకొని బాగా చదవాలి అని, క్రమశిక్షణ, అంకిత భావంతో చదువుకుని పుట్టిన ఊరికి, కన్న తల్లి, తండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, చదువు నేర్పిన అధ్యాపకులకు మంచి పేరు సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టత్మాకంగా చేపట్టిన పి 4 పథకం పట్ల ఆసక్తి చెంది నాకున్న కొద్దిపాటి ఆర్థిక వెసులుబాటుతో మా జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కైకలూరు నియోజకవర్గం శాసన సభ్యులు
, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ లను ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమాలు చేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు......

## విదేశీ పేరున్నంత మాత్రాన హిందువు కాదంటే ఎలా

### మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

చెన్నై,జూలై3 మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు,




పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు హుకుం జారీ చేసింది.

## పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

### 40మంది ప్రయాణికుల దుర్మరణం

ఇస్లామాబాద్,జూలై 3 పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రత్యేక గ్రీవెన్స్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఐ ఎన్ బి టైమ్స్ విజయవాడ జూలై 3: ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ కల్యాణ మండపంలో ప్రత్యేక గ్రీవెన్స్‌తో పాటు ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. పురపాలక, పట్టణాభివృద్ధి 49, రెవెన్యూ 16, గృహ నిర్మాణం 3, విద్య 3, ఐసీడీఎస్ 3 అర్జీలు రాగా ఏపీఐఐసీ 2, పౌర సరఫరాలు 2 అర్జీలు వచ్చాయి. ఇదే విధంగా వివిధ శాఖలకు సంబంధించి మరో ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జులై నెలలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగు చోట్ల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా కూడా స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వెల్లడించారు.
కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇప్పటికే మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించామని.. ఇప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిబద్ధతతో పరిశీలించి సమస్యను నాణ్యంగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూడా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కావడంతో పాటు, సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు మరింత అందుబాటులో, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, పీజీఆర్ఎస్ సమన్వయకర్త జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అల్లాపూర్ లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన...

### ప్రజల సందేహాలను నివృత్తి చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు






ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 3*×= ప్రక్రియలో భాగంగా కూకట్ప ల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు అల్లాపూర్ డివిజన్లోని జరుగు తున్న తీరును పరిశీలించారు.. ప్రధానంగా ప్రజల వద్దకు వెళ్లి బిఎల్ఎ, బిఎల్ఓ ల పనితీరు మరియు ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేశారు.. ముఖ్యంగా ప్రజలు ఈ విషయంలో గందరగోళం పడాల్సిన అవసరం లేదని.. తమ ఓటు హక్కు కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కొద్ది సమయాన్ని కేటాయించి ఓటును పరిరక్షించుకోవాలని అన్నారు.. అలాగే ఏమైనా సందేహాలు ఉంటే అధికారులు పూర్తి సమాచారం తెలియపరుస్తారని ..లేదంటే అన్నివేళలా తాను అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన అన్నారు..ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.పార్టీ మెంబర్ షిప్ ఇంచార్జి గజ్జల నగేష్, మాజీ కార్పొరేటర్ సభియా గౌసుద్దీన్.. మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, లింగాల ఐలయ్య ,నూర్ ,మొయిజ్, సంజీవ్ ,పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గున్నారు ..

## భూముల వేలంలో 50కోట్ల కుంభకోణం

### భద్రకాళి గుడి వద్ద బిఆర్ఎస్ నేతల హంగామా

వరంగల్,జూలై3 వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ భూముల వేలంలో రూ.50 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నాయకుల ఆరోపించారు. దీనిపై ప్రస్తుత కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి భద్రకాళి గుడిలో ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. సవాల్ స్వీకరించిన మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు తడిబట్టలతో ప్రమాణం చేసేందుకు ఆలయానికి వస్తుండగా వారిని పోలీసులు అరెస్ట్ చేయడం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. దీనిపై వెంటనే విచారణ చేయాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబాబాద్,జూలై3 మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని టీక్యా తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. తొర్రూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు కొరిపెల్లి గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనుగా గుర్తించారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

- శంగవరపుకోటలో వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు
-రాష్ట్ర అభివృద్ధికి కీలకం అన్న హోంమంత్రి అనిత



విజయనగరం,జూలై3: ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. శుక్రవారం జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం - తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు. ఎస్.కోట నియోజకవర్గం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో ఎర్ర బస్సు రానిచోట, ఎయిర్‌పోర్టు ఎలా వస్తుందని జగన్ అన్నారని.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి గతంలో వలసలు వెళ్లేవారని.. ఇప్పుడు ఉత్తరాంధ్రకే వివిధ ప్రాంతాలవారు వలసలు వచ్చే పరిస్థితి ఉందని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, ఎమ్మెల్సీలు రఘురాజు, శ్రీనివాస్ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, అధికారులు హాజరయ్యారు.

## అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

### హెచ్చరించిన వాతావరణ శాఖ

విశాఖపట్టణం,జూలై3 ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.
వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ,
పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

# హృత్రిక్, సుసానే విడాకులు


## భరణంగా 400 కోట్లు అంటూ వైరల్

హృతిక్ రోషన్, సుసానే ఖాన్ విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. విడాకుల తర్వాత సుసానే రూ.400 కోట్ల భరణం డిమాండ్ చేశారనే వార్తలు వైరల్ అయ్యాయి. వాటిపై ఆమె సోదరి ఫరాఖాన్ తాజాగా స్పందించారు. ఈ విడాకులు ఇరువర్గాల అంగీకారంతోనే జరిగాయని.. ఇప్పటికీ రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. హృతిక్ సుసానే విడాకులపై సోషల్ మీడియాలో, బయటా పెద్ద రచ్చ జరిగింది. వారి వ్యక్తిగత జీవితంపై చాలా మంది రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కానీ, వారిద్దరూ ఆ క్లిష్ట పరిస్థితిని ఎంతో గౌరవప్రదంగా, హుందాగా ఎదుర్కొన్నారు. ఇక.. సుసానే రూ.400 కోట్ల భరణం తీసుకున్నారన్న వార్తల్లో నిజం లేదు. భరణం తీసుకుని ఆమె మరింత ధనవంతురాలయ్యారని కామెంట్స్ చేస్తున్నారు. అవి చూసి నా మనసు ఎంతో బాధపడుతోంది. ఆ వార్తలు పచ్చి అబద్ధం అని స్పష్టం చేశారు. దీంతో ఈ వార్తలకు బ్రేక్ పడింది. హృతిక్ రోషన్, సుసానే ఖాన్ డిసెంబర్ 2014లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు (రెహాన్, హ్రిదాన్) ఉన్నారు. విడాకులు తీసుకున్నప్పటికీ.. తాము మంచి స్నేహితులుగా ఉంటూ తమ పిల్లల బాధ్యతలను చూసుకుంటున్నట్లు హృతిక్ తెలిపారు.





# నాగబంధం గ్రాఫిక్స్ హైలెట్





## కథా కథనంలో కనిపించని పట్టు

సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు. ఈ ప్రమాదంలో రుద్ర ఫ్యామిలీలోని అందరూ చనిపోతారు. వేల ఏళ్ళుగా రంగనాథ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మకమలంతో రుద్రకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ బ్రహ్మకమలాన్ని దొంగతనం చేయాలని ఆర్కియాలజిస్ట్ ప్రభాకర్ (జగపతిబాబు)తో పాటు అతని కూతురు పార్వతి (నభా నటేష్) ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఆలయంలోని బ్రహ్మకమలం, గరుడ మంత్రాలతో పాటు నాగబంధం గ్రంథం సాయంతో అమరత్వం పొందాలని జుల్ఫికర్ అలీ, భైరాగి (గరుడ రామ్) ఎలాంటి మారణహోమానికి పాల్పడ్డారు? కైలాస పర్వతంలోని విరాటస్వామి ఆలయంలోని ఓ గదిలో ఉన్న రహస్యం ఏమిటి? 17వ శతాబ్దంలో హిందూ దేవాలయాలను దోచుకున్న అబ్దాలీని నాగసాధువు ఎలా నిలువరించాడు? అన్నదే నాగబంధం మూవీ కథ. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నాగబంధం రక్షణగా ఉందనే కథ ప్రచారంలో ఉంది. ఆ నాగబంధాన్ని విచ్ఛిన్నం చేయాలంటే గరుడ మంత్రాలు తెలిసి ఉండాలని పురాణాల్లో రాసి ఉంది. ఈ పాయింట్ నుంచే దర్శకుడు అభిషేక్ నామా స్ఫూర్తి పొంది నాగబంధం కథను రాసుకున్నారు. ఈ చిన్న పాయింట్‌కు సనాతన ధర్మం, హైందవ సంస్కృతితో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్‌స్టోరీని జోడించి సినిమాను రూపొందించారు. నాగబంధం విముక్తి కోసం ప్రయత్నించే అసాంఘిక శక్తులు, దేవుడి అండతో వారిని ఎదుర్కొనే సామాన్యుడైన హీరో.. ఈ అంశాల చుట్టే నాగబంధం కథ సాగుతుంది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది. అబ్బురపరిచే సెట్స్, అదిరిపోయే గ్రాఫిక్స్ లార్జర్ దేన్ లైఫ్‌లాంటి అనుభూతిని అందిస్తాయి. యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. భైరవకోన ఎపిసోడ్, మానసాదేవి టెంపుల్‌లో జరిగే ఫైట్‌తో పాటు అబ్దాలీ మనుషులకు, నాగసాధువులకు మధ్య జరిగే వార్ సీన్లు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. అయితే యాక్షన్ సీక్వెన్స్‌లు సుదీర్ఘంగా సాగడం మాత్రం సినిమాకు మైనస్‌గా మారింది. నాగబంధం కథను మొదలుపెట్టిన తీరు బాగుంది. ఫ్యామిలీ సీన్లు కథకు పెద్దగా అతకలేదు. కథ మొత్తం బ్రహ్మకమలం చుట్టే తిరగడంతో సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు డిఫరెంట్ షేడ్స్‌తో సాగే పాత్రలో హీరోగా విరాట్ కర్ణ మెప్పించాడు. నాగసాధువుగా అతని లుక్ బాగుంది. యాక్షన్ సన్నివేశాల్లో మెప్పించినా, ఎమోషనల్ సీన్ల పరంగా ఇంకా పరిణితి చూపించాల్సి ఉంది. నభా నటేష్‌కు మంచి రోల్ దక్కింది. పాజిటివ్, నెగెటివ్ కోణాల్లో ఆమె పాత్ర సాగుతుంది. కొద్దిసేపు డ్యూయల్ రోల్‌లో కనిపిస్తుంది. విలన్‌గా రిషబ్ డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్ విభిన్నంగా ఉన్నాయి. మరో హీరోయిన్ ఐశ్వర్య మీనన్‌కు ఒకటి రెండు డైలాగ్స్ తప్ప పెద్దగా ఇంపా÷-టంగ÷న్స్ లేదు. జగపతిబాబు, మురళీ శర్మ, మహేష్ మంజ్రేకర్, శరణ్య, అనసూయ, సోనియా సింగ్, అంకిత్ కొయ్యతో పాటు సినిమాలో చాలామందే యాక్టర్లు కనిపిస్తారు కానీ, తమ నటనను చాటిచెప్పే అవకాశం ఎవరికీ దక్కలేదు. విజువల్స్, గ్రాఫిక్స్ పై పెట్టిన శ్రద్ధ కథపై కూడా పెట్టి ఉంటే నాగబంధం రిజల్ట్ మరోలా ఉండేది. చిన్న చిన్న లోపాలున్నా నాగబంధం ప్రేక్షకులను కొంతవరకు మెప్పిస్తుంది.

# ఎఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వాడి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా ఆమె కోర్టుకు వెళ్లింది. ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి సోషల్ మీడియా సంస్థలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరఫు సీనియర్ అడ్వకేట్ వెంకటేష్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్స్ నాణ్యత పెరుగుతోందని, అందువల్ల తక్షణమే సదరు లింకులను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, అయితే సాధారణ చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందస్తుగా పర్యవేక్షించి బ్లాక్ చేయాలనే నిబంధనలు విధించవద్దని కోర్టును అభ్యర్థించారు.



# మా ఇంటి బంగారం ఓ మంచి సినిమా

## సమంతకు కంగ్రాట్స్ చెప్పిన లెనిన్ అఖిల్

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమా జులై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు అఖిల్. ఇక చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ తాజా ఇంటర్వ్యూలో ఆయన టాలీవుడ్ రీసెంట్ ఇండస్ట్రీ హిట్ 'మా ఇంటి బంగారం' సినిమా గురించి అందులో సమంత నటన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'లెనిన్' ప్రమోషన్స్ బిజీ వల్ల తాను ఇంకా 'మా ఇంటి బంగారం' సినిమా చూడలేదని, కానీ ఆ చిత్ర ట్రైలర్ చూశానని అఖిల్ వెల్లడించారు. ట్రైలర్ వైబ్ అద్భుతంగా ఉందని, చూసినప్పుడే ఇది కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని తనకు అనిపించిందని చెప్పారు. ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లి, ఆ కుటుంబ సభ్యులందరితో బంగారం అనిపించుకోవాలనే చక్కటి ఫ్యామిలీ ఎలిమెంట్‌కు పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి సినిమాను చాలా కొత్త కాన్సెప్ట్‌తో, సహజంగా తెరకెక్కించారని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. ఈ చిత్రంలో సమంత పాత్రను అద్భుతంగా పండించిందని మెచ్చుకుంటూ, కంగ్రాట్స్ సామ్ అంటూ సమంతతో పాటు 'మా ఇంటి బంగారం' చిత్రబృందానికి అఖిల్ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా అఖిల్‌తో సమంతకు ఉన్న ఈ రిలేషన్ పరస్పర గౌరవం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదన్నాడు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న 'లెనిన్'లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.

